సమావేశము – III
వాల్యూము – III
నెం.1

వెల : రూ. 9-00
**23** సెప్టెంబర్, 2015
బుధవారము,
(శక సం. 1936,
అశ్విన్ – 1)

# తెలంగాణ శాసన పరిషత్ కార్యకలాపాలు

## అధికార నివేదిక

<u>విషయ సూచిక</u>

**1.** సంతాప ప్రతిపాదన : ... 1

భారతదేశ మాజీ రాష్ట్రపతి భారత రత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం మృతిపట్ల సంతాప తీర్మానం

*****

# తెలంగాణ శాసన పరిషత్

## ప్రధాన అధికారులు

| | | |
|---|---|---|
| ఛైర్మన్ | : | శ్రీ కె. స్వామిగౌడ్ |
| డెప్యూటి ఛైర్మన్ | : | శ్రీ నేతి విద్యాసాగర్ |
| కార్యదర్శి | : | డా. ఎస్. రాజ సదారామ్ |
| ఉప కార్యదర్శులు | : | డా.వి. నరసింహాచార్యులు |
| సహాయ కార్యదర్శులు | : | శ్రీ టి.బి. జయచందర్<br>శ్రీ ఎస్. దుర్గా ప్రసాద్<br>శ్రీ సి.హెచ్. ఉపేందర్ రెడ్డి<br>శ్రీమతి వి. ఎన్. ప్రసన్న కుమారి |
| చీఫ్ రిపోర్టర్ | : | శ్రీమతి యస్. నాగమణి |

*****

# తెలంగాణ శాసన పరిషత్తు

## అధికార నివేదిక

## (మూడవ సమావేశము – మొదటి రోజు)

## బుధవారము, సెప్టెంబర్ 23, 2015

(సభ ఉ. గం. 10.00 లకు ప్రారంభమైనది)

(గౌరవ ఛైర్మన్ అధ్యక్ష స్థానంలో ఉన్నారు)

(జాతీయగీతాలాపన అనంతరం సభ ప్రారంభమైంది)

***

మిస్టర్ ఛైర్మన్ : సభ్యులందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు. అదే విధంగా, రేపు జరుపుకోబోతున్న బక్రీద్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు. ఈ రోజు సభా కార్యక్రమంలో భాగంగా ఉపముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు భారతదేశ మాజీ రాష్ట్రపతి స్వర్గీయ శ్రీ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టవలసిందిగా కోరుతున్నాను.

### సంతాప తీర్మానం

శ్రీ కడియం శ్రీహరి : అధ్యక్షా, భారతదేశ మాజీ రాష్ట్రపతి, భారత రత్న డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ఈ సభ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, శోకార్తులైన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తున్నాము. భారతదేశ 11వ రాష్ట్రపతిగా పనిచేసిన శ్రీ కలాంగారు 11.10.1931వ తేదీన తమిళనాడు రాష్ట్రంలో రామేశ్వరం దగ్గరలోని ఒక మారుమూలన ఉన్న మత్స్యకారుల గ్రామంలో జన్మించారు. వారు ఒక సామాన్య కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యను అభ్యసించారు. పట్టుదలతో పై చదువులు పూర్తిచేసారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్‌లో Madras Institute of Technology నుంచి గౌరవ పట్టా పుచ్చుకున్నారు. వారు ప్రధానంగా Advanced Research Institute, Aeronautical Engineering విభాగాలలో తమ అపారమైన సేవలు అందించడం జరిగింది.

హైదరాబాద్‌లో ఉన్న DRDO, DRDL, ISRO వంటి సంస్థలకు తన సేవలు అందించారు. వారు ఎక్కడ పనిచేసినా, ఆ సంస్థకు, భారతదేశానికి వన్నె తేవడం జరిగింది. ప్రధానంగా వారు హైద్రాబాద్‌లో ఉన్న DRDO కు 982లో, డైరెక్టర్‌గా అదే విధంగా 1992లో భారతదేశ డిఫెన్స్ మినిస్ట్రీలో సలహాదారుగా విధులు నిర్వర్తిస్తూ, 1998వ సంవత్సరంలో ప్రోక్రాన్ పరీక్షలలో అత్యంత కీలకమైన పాత్రను పోషించి, భారతదేశానికి అంతర్జాతీయంగా పేరు, ప్రఖ్యాతులు తీసుకువచ్చిన మహానుభావుడు. రక్షణ రంగంలో వారు ఎంతో విశేషమైన కృషి జరిపిన విషయం మనందరికీ తెలుసు. మిస్సైల్ అప్‌గ్రెడేషన్ విషయంలో గాని, మిస్సైల్ రిసెర్చ్ విషయంలో గాని వారు భారతదేశానికి గొప్ప సేవలందించారు. ప్రధానంగా వారి నాయకత్వంలోనే పృథ్వి మిస్సైల్, ఆకాశ్ మిస్సైల్ మరియు అగ్ని మిస్సైల్ వంటి వాటి తయారీలోను వారు కీలకపాత్ర పోషించారు.

శాస్త్ర, సాంకేతిక రంగాలలో డాక్టర్ కలాంగారి నాయకత్వం, వారి భాగస్వామ్యం ప్రస్ఫుటంగా మనకు కనిపిస్తుంది. భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టడంలో డాక్టర్ అబ్దుల్ కలాంగారి ఘనత ఎంతైనా ఉంది. వారు ఒకవైపు రీసెర్చ్ పనిలో ఉంటూ, మరో ప్రక్క అనేక పుస్తకాలు రచించడం జరిగింది. అందులో కొన్ని పుస్తకాలు మన భారతదేశంలో అత్యధికంగా అమ్మకాలు జరిగాయి. వాటిలో కొన్ని ప్రధానమైనవి (1) A vision for the new Millineum, (2) Wings of Fire.. An Autobiography, (3) Ignited Minds etc., వీటిలో ముఖ్యంగా Wings of Fire.. An Autobiography విశ్వవ్యాప్తంగా ప్రజల అభిమానం చూరగొని, వారికి గొప్ప ఖ్యాతిని తెచ్చిపెట్టింది.

నాయకత్వం విషయంలో గాని, ప్రజలకు సేవ చేసే విషయంలోగాని, అభివృద్ధి చెందే విషయంలో కనే కలలు గాని, మనకు మనమే ఒక రోడ్ మ్యాప్ తయారుచేసుకోవాలని వారు చాలా స్పష్టంగా



J. 268-1

అందులో చెప్పారు. ఈ పుస్తకాన్ని నేను క్షుణ్ణంగా చదివాను. నాకు తెలిసినంత మటుకు భారతదేశంలో విద్యార్థులు, రాజకీయవేత్తలలో ఈ పుస్తకం చదవని వారు చాలా అరుదుగా ఉంటారు. డాక్టర్ కలాంగారు చేసిన పరిశోధనలను, భారతదేశానికి వారు అందించిన సేవలను దృష్టిలో పెట్టుకొని, భారత ప్రభుత్వం వారిని అనేక అవార్డులు, పురస్కారాలతో సముచితంగా సత్కరించడం జరిగింది. 1981వ సంవత్సరంలో పద్మభూషణ్, 1990లో పద్మవిభూషణ్, మరియు 1997లో వారికి అత్యున్నతమైన భారత రత్న అవార్డుతో గౌరవించడం జరిగింది.

డాక్టర్ అబ్దుల్ కలాంగారు దేశ రాష్ట్రపతిగా ఉన్న సమయంలో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో, చేరువగా ఉంటూ, Peoples Presidentగా పేరు పొందారు. అంతకుముందు రాష్ట్రపతిని కలుసుకునే అవకాశం అందరికీ దక్కేది కాదు. కాని డాక్టర్ కలాంగారు విద్యార్థులకు, సామాన్యులకు అందుబాటులో ఉంటూ వచ్చారు. ముఖ్యంగా వారు విద్యార్థులపట్ల ప్రత్యేక అభిమానం చూపేవారు. విద్యా ప్రమాణాలను ఏ విధంగా పెంచుకోవాలి, ఉన్నత కలలు కనండి అని పదేపదే చెబుతూ, వారికి మార్గదర్శకులుగా నిలిచారు. వారు రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా దేశవిదేశాలలో ఉన్న అనేక విద్యాసంస్థలను పర్యటిస్తూ, విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ వచ్చారు. చివరికి వారు మరణించే రోజున కూడా షిల్లాంగ్‌లో ఒక ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు లెక్చర్ ఇస్తూనే తుదిశ్వాస విడిచిన విషయం మనందరికీ తెలుసు. 27.7.2015 న వారు పరమపదించారు. ఆ రోజున మేము ఢిల్లీలోనే ఉన్నాము. వారి పార్థివ దేహం ఢిల్లీకి వచ్చిన తరువాత నేను, మన గౌరవ ముఖ్యమంత్రిగారు శ్రీ కె. చంద్రశేఖర రావు గారి ఆదేశాల మేరకు టి.ఆర్.ఎస్. పార్టీ పార్లమెంటు సభ్యులంతా కలిసి వెళ్లి, శ్రీ అబ్దుల్ కలాంగారికి నివాళులు అర్పించడం జరిగింది. వారి మరణంతో భారతదేశం ఒక గొప్ప వ్యక్తిని, శాస్త్రవేత్తను, మహనీయుడిని కోల్పోయిందని దేశ ప్రజలందరూ భావించారు. వారి మృతికి సంతాపం తెలియచేస్తూ, వారి కుటుంబ సభ్యులకు నా సానుభూతిని తెలియచేస్తున్నాను.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, శ్రీ కడియం శ్రీహరి, ఉపముఖ్యమంత్రిగారు కండోలెన్స్ మోషన్ మూవ్ చేసి, అనేక విషయాలు చెప్పారు. స్వర్గీయ డాక్టర్ అబ్దుల్ కలాంగారు శాస్త్రవేత్తగా ఉన్నప్పుడు మిస్సైల్‌మ్యాన్‌గా, రాష్ట్రపతిగా ఉన్న కాలంలో పీపుల్స్ ప్రెసిడెంటుగా, ఒక గొప్ప ఫిలాసఫర్‌గా, ఒక సైంటిస్టుగా, ఒక బోధకుడిగా, ఒక మానవతావాదిగా ప్రపంచ దేశాలన్నిటిలో పేరుగాంచారు. ఉపముఖ్యమంత్రిగారు చెప్పిన విషయాలతో ఏకీభవిస్తూ, ఈ కండోలెన్స్ మోషన్‌ను బలపరుస్తున్నాను.

డాక్టర్ అబ్దుల్ కలాంగారితో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. వారు 2002వ సంవత్సరంలో రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత, వారు ఇక్కడ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, వారు మొదటిసారిగా హైదరాబాద్‌కి వచ్చినప్పుడు నేను మినిస్టర్‌గా ఆయనతోపాటు అనేక చోట్లకు వెళ్లడం జరిగింది. మేము ఇరువురం కలిసి ఒకే వాహనంలో ప్రయాణిస్తున్నప్పుడు, ఆయన తన జీవితం గురించి చెబుతుండేవారు. ఆ సందర్భంలో వారు తన చిన్ననాటి సంఘటన గురించి చెబుతూ తన తండ్రిగారు గ్రామ సర్పంచ్‌గా పనిచేసేవారని, ఆ సమయంలో ఒక రోజు ఇద్దరు వ్యక్తులు తమ ఇంటికి వచ్చారని, ఆ సమయంలో తన తండ్రి ఇంటి దగ్గర లేకపోవడం వల్ల, వారు తీసుకువచ్చిన పండ్ల బుట్టను తనకు అప్పగించి వెళ్లారు. నేను ఆ బుట్టను ఆయన గదిలో మంచం క్రింద పెట్టానని, తరువాత వారు నమాజ్ నుండి తిరిగి వచ్చి, ఆ బుట్ట గురించి అడిగి, దానిని తీసుకువచ్చింది ఎవరని ప్రశ్నించారు. నాకు తెలవదని చెప్పగా, వెళ్లి తెలుసుకుని రమ్మనిచెప్పారు. నేను కనుక్కుని వచ్చిన తరువాత, తన పర్మిషన్ లేకుండా ఆ బుట్టను స్వీకరించినందుకు శిక్షగా, నా నెత్తిమీద ఆ బుట్టను పెట్టుకుని, స్వయంగా ఆ ఇంట్లో బుట్టను అందచేసి రమ్మని చెప్పారు. నేను మొదటిసారిగా మా నాన్నగారి కోపం చూసానని కలాంగారు చెప్పారు. వారు హైదరాబాద్‌లో DRDOలో పనిచేసే సమయంలో, వారు నివసించే ఇంటికి వెళ్లి, ఆశ్చర్యానికి గురైనాను. కేవలం ఒకే గదిలోనే బస చేస్తున్న ఆయన నిరాడంబరత్వానికి ముగ్దుడినైనాను. అలా వారు పదకొండు సంవత్సరాలు అక్కడ గడిపారు.

నేను అదృష్టంగా భావించే ఒక సంఘటనను ఈ సందర్భంగా మీముందు ఉంచుతున్నాను. వారు రాసిన Wings of Fire అనే పుస్తకాన్ని వారు నా పేరురాసి, సంతకం పెట్టి, నాకు బహుకరించడం జరిగింది.

( ఆ పుస్తకాన్ని సభకు చూపించారు)

వారితో నేను గడిపిన సమయంలో వారి జీవితానుభవాలను నాతో పంచుకోవడం మరిచిపోలేని అనుభూతి. డాక్టర్ అబ్దుల్ కలాంగారు నిరంతరం బీదవారి గురించి, వికలాంగుల గురించి ఆలోచిస్తూ ఉండేవారు. చివరి రోజున కూడా షిల్లాంగ్ ఇన్‌స్టిట్యూట్‌లో విద్యార్థులకు లెక్చర్ ఇస్తూ, హార్ట్‌ఎటాక్‌తో చనిపోవడం జరిగింది. అది ఆయన కోరిక. చివరి రోజు దాకా పని చేస్తూ, విద్యార్థులకు పాఠాలు

చెబుతూ ఉండాలన్నది ఆయన అభిలాష, ఆ విధంగానే వారు తుదిశ్వాస విడిచారు. ఈ రోజు వారు మన మధ్యన లేకపోయినప్పటికీ, వారు బోధించిన విషయాలు మన గుండెల్లో ఉండిపోతాయి. కాబట్టి నేను మీ ద్వారా ప్రభుత్వాన్ని కోరేది ఏమిటంటే.. అంతటి మహనీయుడి జీవితం ఒక సైంటిస్ట్‌గా హైదరాబాద్‌తో ముడిపడి ఉంది కాబట్టి, ఆయన పేరు చిరస్మరణీయంగా ఉండే విధంగా, కొత్తయూనివర్సిటీలు ఏర్పాటు చేసే సమయంలో గాని, లేదా IIT వంటి సంస్థలు ఇక్కడనెలకొల్పేటప్పుడు గాని, ఆయన పేరు మీదవాటిని స్థాపించాలి. అలాగే తెలంగాణ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యాంశంగా ఆయన రాసిన Wings of Fireను చేర్పించాలని కోరుతున్నాను. ఆయన జన్మస్థలం తమిళనాడు అయినప్పటికీ, హైదరాబాద్‌తో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది కాబట్టి, ఈ విషయం పరిశీలించాలని మా కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రభుత్వాన్ని కోరుతున్నాను. వారి కుటుంబ సభ్యులకు నా సంతాపాన్ని తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

**10.20 ఉ.** వచ్చే విద్యా సంవత్సరంలో డాక్టర్ ఎ.పి.జె అబ్దుల్ కలాం గారికి సంబంధించిన విషయాలను మన తెలంగాణ సిలబస్‌లో చేరిస్తే అది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది. ఆయన పుట్టింది తమిళనాడులో అయినప్పటికీ, ఆయన హైదరాబాదులో ఎక్కువ సర్వీసు చేశారు కాబట్టి, మనతో ఆయనకి ఎక్కువ ఎటాచ్‌మెంటు, సంబంధాలున్నాయి కాబట్టి ఆయన జీవిత విశేషాలను తప్పకుండా మన రాష్ట్ర సిలబస్‌లో పెట్టండి. డాక్టర్ అబ్దుల్ కలాం గారికి సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఎక్కువ ఆసక్తి కాబట్టి, పాత పేర్లు మార్చి పెట్టమని చెప్పడం లేదు కానీ, ఆ రంగంలో కొత్త ఇన్‌స్టిట్యూషన్ వచ్చినపుడు మాత్రం దానికి తప్పకుండా వారి పేరు పెడితే బాగుంటుందని కాంగ్రెస్ పార్టీ తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం . డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతి పట్ల గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన ఈ సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, కలాంగారి ఆత్మకి శాంతి చేకూర్చాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, శోకార్తులైన వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ యన్.రామచంద్రరావు(పట్టభద్రుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్): అధ్యక్షా, భారత దేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతి పట్ల గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు ప్రతిపాదించిన సంతాప తీర్మానానికి మా మద్దతు తెలియజేస్తున్నాం. సభ్యులు షబ్బీర్ అలీగారు చెప్పినట్లు అబ్దుల్ కలాం గారికి హైదరాబాదుతో చాలా సంబంధాలున్నాయి. అనేక సంవత్సరాలు ఆయన హైదరాబాదులోని డి.ఆర్.డి.ఓ.లో పని చేశారు. రాష్ట్రపతి అయిన తర్వాత కూడా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజల రాష్ట్రపతిగా పేరుగాంచిన వ్యక్తి ఆయన. అటువంటి వ్యక్తి మన భారతదేశంలో జన్మించడం మనందరికీ గర్వకారణం. ముఖ్యంగా యునైటెడ్ నేషన్స్ కలాం గారి కృషిని గుర్తించి వారి జన్మ దినాన్ని **"వరల్డ్ స్టూడెంట్స్ డే"** గా ప్రకటించింది. కలాంగారు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉన్నత పదవులు అలంకరించినా చాలా నిరాడంబరమైన జీవితాన్ని గడిపారు. బీద కుటుంబంలో పుట్టి ఇంత పైకి వచ్చిన వ్యక్తి మనందరికీ కూడా మార్గదర్శకులుగా ఉన్నారనే విషయాన్ని మనవి చేస్తున్నాను. వారు రచించిన పుస్తకాలు మన యువతీ/యువకులను, విద్యార్థులను ఎంతో ప్రభావితం చేశాయి. ఆయన రాసిన వింగ్స్ ఆఫ్ ఫైర్ లో – ఐ.ఏ.యస్. ఆఫీసర్ కావాలని, పైలట్ కావాలని వారు ఏవిధంగా ప్రయత్నం చేశారో, అందులో వైఫల్యం చెందిన తర్వాత కూడా ఇంకా జీవితంలో ఏవిధంగా ముందుకు పోవాలనే సంకల్పం వారికి ఉండేదో రాశారు, దాన్ని మన విద్యార్థులు emulate చేసుకోవలసిన అవసరం ఉంది.

కలాం గారు రాష్ట్రపతిగా ఉన్నపుడు ఇద్దరు ప్రధానమంత్రులను చూశారు. వారు ప్రపంచ వ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతులు గడించారు. కలాంగారు మరణించినపుడు – భారతదేశం ఒక గొప్ప నాయకుణ్ణి కోల్పోయిందని అమెరికా అధ్యక్షులు ఒబామాగారు వ్యాఖ్యానించడం జరిగింది. వారు ఈదేశానికి చేసిన సేవలు, నవ యువకులు/ విద్యార్థులు సరైన దారిలో పయనించేలా ఇచ్చిన ప్రోత్సాహాన్ని మనం ఎప్పటికీ మరచిపోలేం. ఆయన కేవలం ఒక మానవతావాదే కాదు. సమస్యల గురించి అన్ని కోణాల నుంచి ఆలోచించే వారు. అంగవైకల్యంతో బాధపడుతున్న బీద పిల్లల గురించి కూడా ఆయన ఆలోచించారు. హైదరాబాదులోని నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(నిమ్స్) లో ఆయన ఒక డాక్టర్‌తో మాట్లాడుతున్నపుడు ఎంతో బరువున్న ఒక క్రెచ్ సహాయంతో ఒక చిన్న పాప కాళ్లు ఈడ్చుకుంటూ పోతుంటే ఎందుకు ఆ అమ్మాయి అలా నడుస్తోందని అడిగారు. దాని బరువు నాలుగైదు కిలోల కన్నా ఎక్కువే ఉంటుంది, ఆ బరువు మోయలేక ఆవిధంగా ఈడ్చుకుంటూ పోతోందని ఆ డాక్టర్ చెప్పారు. ఆవిషయాన్ని దృష్టిలో పెట్టుకుని, మిస్సైల్ నిర్మాణంలో ఉపయోగించే అల్లాయ్ మెటీరియల్‌తో కేవలం నలభై నుంచి యాభై గ్రాముల బరువుండే తేలికైన క్రెచ్‌లను వేలాది మంది బీద వికలాంగ పిల్లలకు ఆయన తయారు చేసి ఇవ్వడం జరిగింది.

ఈవిధంగా మెడికల్ సైన్స్‌కి వారు చేసిన కంట్రిబ్యూషన్ మరచిపోలేనిది. అదే హాస్పిటల్‌లో ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సోమరాజు గారితో కలిసి అల్లాయ్ మెటీరియల్‌ను ఉపయోగించి తక్కువ ధరకే నాణ్యమైన స్టెంట్లను తయారుచేశారు. లక్షల ఖరీదు చేసే స్టెంట్లను సామాన్యులకు కూడా అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ప్రపంచ మార్కెట్‌లో స్టెంట్ల ధరలను తగ్గించి సామాన్యులకు అందించడం జరిగింది. ఈ మెడికల్ సైన్స్ రంగంలో వారి కంట్రిబ్యూషన్ మరవలేనిది. వారి మరణం కేవలం భారతదేశానికే కాదు, మొత్తం ప్రపంచానికే తీరని లోటు. షిల్లాంగ్ ఐ.ఐ.యం.లో లెక్చర్ ఇవ్వడానికి వారు వెళ్లినపుడు – ఎయిర్‌పోర్టునుంచి ఆ కాలేజీ వరకు సెక్యూరిటీగా ముందున్న జీపులో ఒక ఆర్మీ జవాను ఒకరెండు గంటల పాటు నిల్చొని ఉన్న విషయాన్ని కలాంగారు గమనించి, కాళ్లు నొప్పి పుడతాయి , అతన్ని కూర్చోమని వైర్‌లెస్‌లో మెస్సేజ్ పంపినా అది చేరకపోతే, లెక్చర్ ముగిసిన తర్వాత ఆ జవానుని పిలిపించి, నాకోసం నువ్వు రెండు గంటల పాటు కష్టపడ్డావు కదా అని అంటే – ఆ సైనికుడు ఆశ్చర్యపోయి, కళ్లల్లో నీళ్లు పెట్టుకుని, సార్ మాగురించి మీరింతగా ఆలోచిస్తున్నారా, మీలాంటి వాళ్ల కోసం రెండు గంటలు కాదు ఆరు గంటలైనా నిలబడతామని చెప్పిన విషయాన్ని కలాంగారి మరణ సమయంలో వారి మిత్రులు చెప్పడం జరిగింది.

అలాంటి మానవతావాదిని మనం ఈరోజు కోల్పోయాం. భారత రాష్ట్రపతిగానే గాకుండా, భారత రత్నతోబాటు అనేక బిరుదులు పొందిన డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి పేరును, ఇంతకు ముందు సభ్యులు షబ్బీర్ అలీగారు చెప్పినట్లుగా, రాబోవు కాలంలో ఏదైనా ఒకమంచి ఇన్‌స్టిట్యూట్‌కి పెట్టడానికి నా మద్దతు ఉంటుంది. డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాం స్మృతిపట్ల గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తూ, కలాంగారి ఆత్మకి శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ధైర్యం ఇవ్వాలని భగవంతుణ్ణి కోరుకుంటూ ముగిస్తున్నాను.

SRI SYED AMINUL HASAN JAFRI ( Teachers Constituency, Hyderabad): Sir, I fully support the Condolence Motion, which has been moved by Sri Kadiyam Srihari, Hon'ble Deputy Chief Minister of Telangana in the memory of late Dr. A.P.J. Abdul Kalam, the former XI President of India. My colleagues have pointed out that Dr. A.P.J. Abdul Kalam had associated with Hyderabad for more than a decade, when he was in Hyderabad the missile programme was conceived and it was launched successfully. Dr. Abudl Kalam sahebs contribution was not only limited to missile technology, but he was also closely associated with the Space Launch Vehicle Mission (SLV). As a Scientific Advisor to the Ministry of Defense, he was closely associated with Pokran-II explosion in the year 1998.

As a Journalist, I have covered so many such types of events.When he was awarded Padmabhushan in the year 1990 at that time, he was working as Director in DRDL, Kanchanbagh, Hyderabad. Apart from that, the RCI, Imarat was also his contribution. It was set up by him. It is also connected with the Missile Technology and various other Defense Research Centres, which have come to the Hyderabad only because of the initiation of Dr. A.P.J. Kalam Saheb. BDL and MIDHANI were also started during his stay in Hyderabad.

As a President of India, he had endeavoured and encouraged the youth of the Country and he had the vision to see India as a Super Power by 2020. It is very unfortunate that he had passed away while addressing the meeting, so particularly inspiring the youth in IIM, Shillong. It could have been an Honour to see his vision India translating into reality. We pay homage to him and pray to Allah that may his soul rest in peace. Thank you Sir.

శ్రీ కాటేపల్లి జనార్థన్ రెడ్డి (ఉపాధ్యాయుల నియోజకవర్గం – మహబూబ్‌నగర్, రంగారెడ్డి మరియు హైదరాబాద్)ః అధ్యక్షా, కీర్తిశేషులు భారత రత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారి స్మృతి పట్ల మన ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి పూర్తిగా మద్దతు తెలియజేస్తున్నాను. నిజంగా ఆయన మన భారతదేశంలో పుట్టడం యావత్ భారత ప్రజానీకం యొక్క అదృష్టంగా భావించవలసిన అవసరం ఉంది. ఒక మారుమూల గ్రామంలో ఒక నిరుపేద కుటుంబంలో జన్మించి దేశ రక్షణకు వారు చేసినటువంటి సేవలు అమోఘమైనటువంటివి. ఆరకంగా రక్షణ రంగంలో క్షిపణి పితామహుడిగా పేరు తెచ్చుకునే విధంగా వారు దేశ రక్షణ బాధ్యతనే కాకుండా, యావత్ భారతీయుల యొక్క రక్షణ బాధ్యతను కూడా స్వీకరించి, ప్రతి భారతీయుడు నిర్భయంగా జీవించడానికి ఆయన చేసినటువంటి సేవలు అమోఘమైనవనే విషయాన్ని తమ ద్వారా తెలియజేస్తున్నాను.

వారు ఒక శాస్త్రవేత్తగా దేశ రక్షణకు ఏ విధంగా ఉపయోగపడ్డారో, అదేవిధంగా రాష్ట్రపతి పదవి తరువాత ఆయన విద్యారంగానికి చేసిన సేవలు కూడా అమూల్యమైనవనే విషయాన్ని తెలియజేస్తున్నాను. యావత్ ఉపాధ్యాయ లోకానికి ఒక స్ఫూర్తి ప్రదాతగా యువకుల ఉజ్వల భవిష్యత్తు పైన ఈ దేశం ఆధారపడి ఉందనే ఉద్దేశంతో

నిరంతరం విద్యార్థి లోకానికి ఒక ఉపాధ్యాయునిగా, వారందరూ ఒక సన్మార్గంలో నడిచేవిధంగా ఆయన చేసిన సేవలు, యావత్ విద్యారంగం, ఉపాధ్యాయ లోకం ఎన్నడూ మరువలేనటువంటిది.

వారు ఏదైనా సరే, ఒక దేశభక్తునిగా, దేశ ప్రజానీకం ఒక మంచి వాతావరణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా నివసించే విధంగా ఒక శాస్త్రవేత్తగా వారు సేవలు అందించడం, విద్యార్థి దశ నుంచే వారిలో ఒక శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించి, వారిని భావి శాస్త్రవేత్తలుగా వారికి ఏదో ఒకటి అందించాలనే తపనతో విద్యారంగంలో కూడా ఇన్స్పైర్ అవార్డులను, అంటే అతి పేద విద్యార్థులు కూడా వారిలో ఉన్న సైంటిఫిక్ నాలెడ్జ్‌ను వెలికి తీయాలనే ఉద్దేశంతో, కేంద్రప్రభుత్వపరంగా వారికి ప్రోత్సాహకాలు అందిస్తూ, చిన్ననాటి నుంచే వారిలో శాస్త్రవేత్తలుగా ఎదగాలనే ఆశాభావాన్ని నెలకొల్పాలనే ఉద్దేశంతో ఈ అవార్డులకు రూపకల్పన చేశారు. వాటి ద్వారా ఎంతోమంది విద్యార్థులు భావి శాస్త్రవేత్తలుగా ఎదిగే విధంగా కృషి చేయాలని కోరుతున్నాను.

ఆయన చివరి వరకూ కూడా ఒక మాటే చెపుతూ వచ్చారు. రాష్ట్రపతిగా ఉన్నప్పుడు మాత్రమే నా ప్రభావం ఉంటుందని, నిరంతరం సమాజం మీద ఈ విధంగా ప్రభావం ఉండాలంటే, ఒక అధ్యాపకునిగా మాత్రమే విద్యార్థుల ద్వారా సమాజంలో అభివృద్ధిపై కృషి చేస్తామనే ఉద్దేశంతో రాష్ట్రపతి పదవి తరువాత అధ్యాపక వృత్తిని ఎన్నుకుని, విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విధంగా ఉపాధ్యాయ లోకానికి ఆదర్శవంతునిగా వారు చేసిన సేవలు యావత్ ఉపాధ్యాయ లోకానికి, యావత్ భారతదేశ ప్రజలు ఎన్నడూ మరువలేరని తెలియజేస్తున్నాను. ప్రతి విద్యార్థి సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా ఎదగాలనే ఏదైతే తపనతో ఆయన ఉన్నారో, ప్రతి విద్యార్థినిని కూడా సమాజానికి ఉపయోగపడే పౌరుడిగా తీర్చిదిద్దినట్లయితే, ఆటోమేటిక్‌గా విద్యార్థుల భవిష్యత్తుతో పాటు, ఈ సమాజాభివృద్ధి కూడా చేకూరుతుందనే ఏదైతే ఆకాంక్షతో ఉన్నారో, వారి ఆకాంక్షలను కూడా తీర్చవలసిన అవసరం ఉంది. ఆయన మృతి కేవలం వారి కుటుంబాన్నే కాకుండా, యావత్ భారత దేశాన్ని శోక సంద్రంలో నింపినటువంటి విషయాన్ని సభ ద్వారా తెలియజేస్తున్నాను.

ఆయన సేవలను, ఆశయాలను మనం ఇంకా బ్రతికించుకుంటూ, దేశ అభివృద్ధిలో, రక్షణ రంగంలో ఏ తపనతో వారు ఉన్నారో, వారి ఆశయాలు చిరస్థాయిగా ఉండే విధంగా, అవి దేశ ప్రజలకు అందేవిధంగా చేయవలసిన అవసరం ఉంది. ఏదైనా ఒక గొప్ప ఇన్‌స్టిట్యూషన్‌కు ఆయన పేరు పెట్టే విధంగా మన రాష్ట్ర ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకోవాలని, వారి ఆశయాలను ఇంకా బ్రతికించుకుంటూ మన దేశ అభివృద్ధికి కృషి చేయవలసిన ఆవశ్యకత మనందరిపైనా ఉన్నదనే విషయాన్ని తమ ద్వారా తెలియజేస్తూ, డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతికి తీవ్ర సంతాపం తెలియజేస్తున్నాను. ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టిన సంతాప తీర్మానానికి పూర్తి మద్దతు తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ జూపల్లి కృష్ణారావు : అధ్యక్షా, గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానానికి మద్దతునిస్తూ, భారత రత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారు భారత జాతికి, భారతదేశానికే ఒక గొప్ప అదృష్టం అనే విషయాన్ని మనవి చేస్తున్నాను. ఆయన ఒక మహా పురుషుడు. Simple living, High thinking వారిది. యావత్ భారత జాతిలో ఉన్న యువతను, విద్యార్థి లోకాన్ని ప్రభావితం చేసి, ఆలోచింప చేసిన వ్యక్తి. భారత జాతికి ఒక మెసేజ్ ఏ విధంగా పోయిందంటే – ప్రతి విద్యార్థి మరియు అట్టడుగున ఉన్న గ్రామీణ స్థాయిలో ఉన్న సామాన్య విద్యార్థులు కూడా తెలుసుకునే విధంగా – కలలు కనండి, ఆ కలలను సాకారం చేసుకోండి అనే పిలుపును ఇచ్చి, భారత జాతి మొత్తానికి దీనిని ప్రచారం చేయడం జరిగింది.

నా అదృష్టం ఏమిటంటే, డా. ఏ.పి.జె. అబ్దుల్‌కలాంగారు రాష్ట్రపతిగా ఉన్న సందర్భంలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో జాయింట్ సెషన్ ఏర్పాటు చేయడం జరిగింది. అందులో వారు ప్రసంగించిన సందర్భంలో పది ప్రశ్నలు సంధించడానికి అవకాశం ఉన్నది. ఒక్కొక్క పార్టీ వారు ఒక్కొక్క ప్రశ్నను అడగడం జరిగింది. ఆరోజున నేను స్వతంత్ర అభ్యర్థిగా ఉన్నాను. స్వతంత్ర అభ్యర్థిగా నేను అవకాశం తీసుకుని ఆయనను ఒక ప్రశ్న వేయడం జరిగింది. ఆనాడు కూడా రైతుల ఆత్మహత్యలు జరుగుతూ ఉన్నాయి. మీరు కర్మ సిద్ధాంతాన్ని నమ్ముతారా? దానిని నమ్మినట్లయితే, ఈ ఆత్మహత్యలకు కారణం.. కర్మ కారణంగా అవి జరుగుతున్నాయా? దీనికి పరిష్కారం లేదా అని నేను వారిని ప్రశ్నించడం జరిగింది. దానికి వారు సమాధానం చెబుతూ, మనిషికి రకరకాల సమస్యలు ఉంటాయి. అదే విధంగా రైతాంగానికి కూడా ఉంటాయి. కానీ, ఈ ఆత్మహత్యలు ఈ స్థాయిలో జరగడానికి ఒకే ఒక్క ప్రధాన కారణం – సమస్యలతోపాటుగా, ఉమ్మడి కుటుంబాల వ్యవస్థ ఛిన్నాభిన్నం కావడం అన్నారు. కష్టాలలో ఉన్నప్పుడు, వారిని ఓదార్చడానికి ఆనాటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థలో కుటుంబ సభ్యులుండేవారు. కష్టాలు వస్తే తాతో, అన్నయ్యో, తమ్ముడో, అక్క, చెల్లి ఓదార్చే పద్ధతి ఉండేది. వారు కొంత ధైర్యం చెప్పే పరిస్థితి వచ్చేది.

ఆ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఛిన్నాభిన్నమవడం కూడా ప్రస్తుత ఆత్మహత్యలు పెరగడానికి కారణం అవుతోంది. మళ్ళీ అటువంటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ రావాలని ఆనాడు ఉమ్మడి శాసనసభలో గౌరవ రాష్ట్రపతి గారు చెప్పడం జరిగింది. అంటే, అన్ని అంశాల పట్ల కూడా అవగాహనతో, ఒక తత్వవేత్తగా, ఒక శాస్త్ర వేత్తగా, ఒక దార్శనికుడిగా, సమాజం పట్ల అన్ని సమస్యల మీద పూర్తి అవగాహన ఉండి, simple living, high thinking తో యావత్ భారత జాతిని కూడా మేల్కొలిపే ప్రయత్నం ఆయన చేయడం జరిగింది. అటువంటి మహానుభావుడు, మహా పురుషుడు మన మధ్య లేకపోవడం దురదృష్టకరం. అటువంటి జాతిరత్నాన్ని మనం కోల్పోవడం జరిగింది. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, రాష్ట్రంలో ఉన్నటువంటి ఒక ప్రధానమైన పట్టణానికి గానీ, ఒక గొప్ప ఇన్‌స్టిట్యూషన్‌కి గానీ వారి పేరు పెట్టే విషయాన్ని గౌరవ ముఖ్యమంత్రిగారి దృష్టికి కూడా తీసుకువెళ్ళడానికి మావంతు ప్రయత్నం చేస్తామని తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను, నమస్కారం.

**10.40 ఉ.** శ్రీ పొంగులేటి సుధాకర్ రెడ్డి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, భారత రత్న, క్షిపణి పితామహుడు, మాజీ రాష్ట్రపతి డా.ఏ.పి.జె. కలాంగారి సంతాప తీర్మానం ప్రవేశపెడుతూ గౌరవ ఉప ముఖ్యమంత్రిగారు మాట్లాడిన మాటలకు, అలాగే, గౌరవ ప్రతిపక్ష సభ్యులు శ్రీ షబ్బీర్ ఆలీగారు, మంత్రివర్యులు శ్రీ జూపల్లి కృష్ణారావు మాట్లాడిన మాటలకు నేను కూడా ఏకీభవిస్తున్నాను. ముఖ్యంగా డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారు విజ్ఞాన గని, మానవీయ కోణం ఉన్న వ్యక్తి. గతంలో స్వామి వివేకానంద యువతరానికి ఏ విధంగా స్ఫూర్తి కలిగించారో, అదే విధంగా నేడు యువశక్తికి దిశ, దశ చూపించి మార్గదర్శియై, భారతదేశంలో మానవీయ విలువలు, మానవీయ శక్తి అపారమైనదని ప్రపంచానికి చాటిచెప్పిన నిరాండంబరమైన వ్యక్తి డా.అబ్దుల్ కలాంగారు. భారతదేశంలోని సగటు మానవుడు అంటే ప్రపంచ దేశాలలో ఒక దుష్ప్రచారం ఉండేది.

భారతీయుల పేదరికాన్ని చూసి అపహాస్యం చేసే పరిస్థితులలో, ఒక సామాన్య కుటుంబంలో పుట్టి అమెరికా, రష్యా దేశాలకు దీటుగా క్షిపణి ప్రయోగాలను చేసి భారత వైజ్ఞానిక రంగాన్ని భారత దేశ వినీల ఆకాశంలో ఒక మహోజ్జ్వల తారగా వెలుగొందిన కలాంగారు ఈనాడు మన మధ్యనుండి వెళ్ళిపోయిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియచేస్తూ, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను.

డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారు ఒకసారి కేరళ వెళ్ళినప్పుడు ప్రభుత్వం పెద్ద స్టార్ హోటల్‌లో అకామడేషన్ ఇచ్చారు. ఆ గేటు పక్కన ఒక చిన్న టీ స్టాల్ ఒకవైపు, పంక్చర్ షాపు మరోవైపు ఉండటం చూసి ఆయన మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ వాళ్ళిద్దరితో కలిసి చేశారని నేనొక ఆర్టికల్‌లో చదివాను. ఇప్పుడే సోదరుడు మనవిచేసినట్లు, కలాంగారికి ఎంతో కరుణ, జాలి వంటి గుణాలు ఎక్కువగా ఉండేవి. మహానుభావులు, మహోన్నతమైన వ్యక్తులు జాతిపిత మహాత్మాగాంధీ లాంటి చాలామంది చరిత్ర సృష్టించిన వ్యక్తులు ఈ విధమైన గుణాలను కలిగి ఉండేవారు. వారి జీవితమే ఒక చరిత్ర. అదే మనకు మార్గదర్శకం. అటువంటి గుణాలు కలిగిన దండలో ఒక పూవుగా ఉండే వ్యక్తిత్వం గల వ్యక్తి డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారు అనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు కలాంగారి పేరు పెట్టమని కేంద్రప్రభుత్వానికి ఇప్పటికే సిఫారసు చేయడం జరిగింది.

రాష్ట్రప్రభుత్వానికి ఆ ప్రతిపాదన ఉందో లేదో నాకు తెలియదు గానీ, స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి ఒకసంస్థను పెట్టే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నదన్నారు కాబట్టి, దానికి కలాంగారి పేరుపెట్టడమనేది సందర్భోచితంగా ఉంటుందని నా మనవి. అలాగే, ప్రతి సంవత్సరం మెరిటోరియస్ స్టూడెంట్‌కి **'కలాం ఎక్స్‌లెన్స్ అవార్డు'**ను ఇచ్చినట్లయితే ఆయన పేరు చిరస్థాయిగా నిలచిపోతుందని అదే వారికిచ్చే నిజమైన నివాళిగా మనవిచేసుకుంటున్నాను.

మా సోదరుడు జూపల్లి కృష్ణారావుగారు మంచి సబ్జెక్ట్ ఉన్న వ్యక్తి, సందర్భోచితంగా మాట్లాడతారు. ఈ సందర్భంలో కూడా వారు వేసిన ప్రశ్నేమిటో, ఏం సమాధానం చెప్పారో తెలియదు గానీ, రైతుల ఆత్మహత్యల వ్యవహారం గురించి తరువాత మాట్లాడదాము. కానీ, సందర్భం వచ్చినప్పుడు బరాబర్‌గా ఇదే సభలో మాట్లాడతాను. నేడు గౌరవ ప్రదమైన ఈ సందర్భంలో నేను సబ్జెక్ట్ డీవియేట్ కాకుండా ఇప్పుడు ఇంతకంటే ఎక్కువ మాట్లాడకుండా డా.అబ్దుల్ కలాంగారికి ఘనమైన నివాళులర్పిస్తూ, వారికి ఆత్మశాంతి కలగాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులకి భగవంతుడు శక్తినివ్వాలని ప్రార్థిస్తూ, చరిత్ర సృష్టించిన వ్యక్తిగా డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారు చరిత్రలో మిగిలిపోతారని మనవిచేస్తూ, నాకు ఇచ్చిన అవకాశానికి ధన్యవాదాలు తెలియచేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ కర్నె ప్రభాకర్ (నామినేటెడ్): డా.ఏ.పి.జె.అబ్దుల్‌కలాంగారి సంతాప తీర్మానానికి మద్దతు తెలిపేందుకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసుకుంటూ, ఆదర్శవంతమైన జీవితం గడిపినటువంటి డా.ఏ.పి.జె.అబ్దుల్ కలాంగారి గురించి ఎంత

మాట్లాడినా తక్కువనే చెప్పవచ్చు. అయినప్పటికీ, చట్ట సభల్లో ఉన్నటువంటి మనం వారిని గుర్తుచేసుకోకుండా ఉండలేము. వారు గడిపినటువంటి జీవితం ఎంతో సామాన్యమైనది, అతి పేద కుటుంబంలో పుట్టినటువంటి కలాంగారు చివరికి తాను అతి సామాన్యంగా చనిపోయిన సందర్భాన్ని కూడా మనం ఇప్పుడు గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉంది.

దేశ భద్రతకు సంబంధించి ఒకానొక సందర్భంలో సైనికులకు మానసిక ధైర్యం ఇవ్వాలని చెప్పి వారు సాధారణ నైపుణ్యం గలవారు అయినప్పటికీ కూడా యుద్ధ విమానంలో ప్రయాణం చేశారు. సాధారణ నైపుణ్యం గలవారు ఆ యుద్ధ విమానాలలో ప్రయాణం చేయడం అనేది చాలా కష్టమైన విషయం. ఎందుకంటే, అందరూ వాటికి తట్టుకునే పరిస్థితిలో ఉండరు, కానీ డా. కలాం గారు మాత్రం ఎంతో సాహసంతో యుద్ధ విమానంలో మరియు జలాంతర్గామిలో ప్రయాణం చేసి సైనికులకు మానసిక ధైర్యాన్ని పంచారు. వారు గడిపినటువంటి సామాన్య జీవితాన్ని మనం గుర్తు చేసుకుంటే, ఒక విశ్వవిద్యాలయానికి Guest Lecturer గా సంవత్సరానికి రెండు, మూడు క్లాసులు తీసుకునేందుకు వెళుతుండేవారు. ఒకసందర్భంలో ఆ కళాశాలకు వెళ్లినప్పుడు, ఆ కళాశాల వారు తనకు ఒక Suit Room కేటాయిస్తే, నేను ఎప్పుడో ఒకసారి వచ్చేవాడిని కాబట్టి నాకు Suit Room అవసరం లేదని కేవలం ఒక రూము, చిన్న బెడ్ ఇస్తే చాలని అతి సామాన్యుడిగా చెప్పినటువంటి వ్యక్తి డా.అబ్దుల్ కలాంగారు. అలా ఒక సామాన్య వ్యక్తిగా ఎంతటి ఆదర్శవంతమైన జీవితం గడిపారో అనేది అర్థం చేసుకోవచ్చు.

నిజానికి వారు రాష్ట్రపతిగా ఉన్నప్పటికీ, వారు చనిపోయిన తరువాత రెండు ప్యాంట్లు, రెండు చొక్కాలు, రెండు సూట్లు నాలుగు పుస్తకాలే వారి ఆస్తి అని చెప్పి ప్రచురించారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నటువంటి మనందరం కూడా వారినుండి అనేకమైనటువంటి ఆదర్శవంతమైన జీవిత విషయాల్ని నేర్చుకొని భవిష్యత్ తరాలకు మనందరం అందించేటువంటి పద్ధతిలో ఉండాలని కోరుకుంటున్నాను. తన తండ్రి దగ్గర నుండి నేర్చుకున్నటువంటి ఆదర్శవంతమైన జీవితంతో ఈ దేశానికి తన సేవలందిస్తూ, చనిపోయే చివరి క్షణం వరకు కూడా విద్యార్థులకు విద్య నేర్పుతూ ఏ ఒక్క మనిషిని ఇబ్బంది పెట్టకుండా, ఏ ఒక్క మనిషితో కూడా సేవ చేయించుకోకుండా హఠాత్తుగా చనిపోవడం ఈ దేశానికి బాధాకరమైనప్పటికీ వారి ఆదర్శవంతమైన జీవితాన్ని గుర్తు చేసుకుంటూ గౌరవనీయులు ఉప ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టినటువంటి సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుతూ ధన్యవాదాలు తెలియజేసుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ ఫారూక్ హుస్సేన్(నామినేటెడ్) : ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశ పెట్టినటువంటి సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుకుంటూ, డా.అబ్దుల్ కలాంగారు ఈ దేశానికి దశ, దిశా నిర్దేశాన్ని చూపించినటువంటి వ్యక్తిగా మనమందరం ఎప్పటికీ గుర్తుంచుకుంటాము. ఆయన చనిపోయే వరకు కూడా దరిద్రం పోవాలి, బీదరికం పోవాలి, అందరం చదువుకోవాలనే భావనతో ఉండేవారు. 2006లో నేను Minority Corporation Chairman గా ఉన్నప్పుడు Madina Education Center లో సమావేశం ఉంటే, అక్కడికి భారత రాష్ట్రపతి హోదాలో తాను అక్కడికి రావడం జరిగింది. అప్పుడు నేను కూడా ఆ సమావేశానికి హాజరు కావడం జరిగింది. ఆ సమావేశంలో దాదాపు పదిహేను వందల మంది విద్యార్థులు పాల్గొనడం జరిగింది. అప్పుడు ఆ సమావేశంలో తాను మాట్లాడుతూ, విద్యార్థులను ఉద్దేశించి ఎంతమంది ఇంజనీర్లు అవుతారు? అని అడిగితే విద్యార్థుల్లో దాదాపు 33శాతం వరకు చేతులు ఎత్తడం జరిగింది. దాని తరువాత పైలెట్ ఎంతమంది అవుతారు? డాక్టర్లు ఎంతమంది అవుతారు? అని అడిగితే దాదాపు 25శాతం, 30శాతం మంది విద్యార్థులు చేతులు ఎత్తడం జరిగింది. చివరిగా రాజకీయ నాయకులు ఎంతమంది అవుతారని అడుగగా, ఏ విద్యార్థి కూడా చేయి ఎత్తలేదు. ఆ సందర్భంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ నాయకులు వారి ఆలోచనలు మార్చుకోవాలని, ఈ దేశానికి సేవ చేయాలని, విద్యార్థులకు దిశా నిర్దేశాన్ని ఇచ్చే విధంగా వారిలో మార్పు తెచ్చుకుంటేనే యువతరానికి మంచి సందేశం చేరుతుందనే విషయాన్ని చెప్పినటువంటి వ్యక్తి డా.అబ్దుల్ కలాం గారు. రామేశ్వరంలో బెస్త కులానికి చెందిన కుటుంబంలో పుట్టి ఒక మిస్సైల్ మ్యాన్‌గా ఎదిగినటువంటి వ్యక్తి డా.అబ్దుల్ కలాంగారు. నిజంగా కూడా మన దేశంలోని ప్రజలు ముఖ్యంగా జ్ఞాపకం చేసుకునే వ్యక్తుల్లో ముందుగా మహాత్మా గాంధీ, మదర్ థెరిసా, తరువాత డా.అబ్దుల్ కలాం గారినే అని చెప్పుకోవచ్చు.

శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ మరియు శ్రీ కడియం శ్రీహరిగారు మాట్లాడుతూ, డా.అబ్దుల్ కలాంగారు యువకులకు చాలా ఆదర్శవంతంగా ఉన్నారని చెప్పారు. చిన్న పిల్లల్ని దగ్గరకు తీసిన వ్యక్తుల్లో శ్రీ పండిట్ జవహర్ లాల్ నెహ్రూ తరువాత డా.అబ్దుల్ కలాం గారేనని చెప్పక తప్పదు. అందుకని ఆయన మనస్సును గమనించినటువంటి వ్యక్తిగా, ఆయన మనస్సు గురించి ఒక కవిత్వం చెప్పదలచుకున్నాను.

جب تک سورج چاند رہے گا
اے پی جے عبدالکلام تیرا نام رہے گا

خدا حافظ

నేను చనిపోయినాగానీ, ఈ ప్రజలకు ఒక మెస్సేజ్ ఇచ్చి పోతాననే భావనతో చనిపోయినటువంటి వ్యక్తి డా.అబ్దుల్ కలాంగారు.

خاموشی کی زندگی گوارا نہیں مجھے
شیشہ ہوں ٹوٹ کر بھی کنارہ چھوڑ جاؤں گا

శ్రీమతి ఆకుల లలిత(శాసనసభ నియోజకవర్గం) : ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశ పెట్టినటువంటి సంతాప తీర్మానానికి మద్దతు తెలుపుకుంటూ, భారతదేశం మాజీ రాష్ట్రపతి, భారత రత్న డా.అబ్దుల్ కలాం గారి మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేస్తూ, వారు ఎంతో బీద కుటుంబంలో పుట్టి, పేపర్ బాయ్‌గా పని చేసి ఎంతో కష్టపడి చదువుకొని శాస్త్రవేత్తగా ఎదిగి పిల్లల పట్ల ప్రేమను చూరగొన్న డా.అబ్దుల్ కలాంగారిని తప్పకుండా స్మరించుకోవాలి. వారు మన దేశానికి ఎన్నో సేవలందించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ గౌరవ ప్రతిపక్ష నాయకులు చెప్పినట్లుగా మన రాష్ట్ర విద్యార్థులు ఎప్పుడూ వారిని స్మరించుకునే విధంగా ఉండేందుకు ఏదైనా విద్యా సంస్థకి వారి పేరుపెట్టాలని కోరుకుంటూ నాకు ఈ అవకాశం ఇచ్చినటువంటి ఛైర్మన్‌గారికి ధన్యవాదాలు తెలుపుకుంటూ ముగిస్తున్నాను.

శ్రీ కొంపల్లి యాదవ రెడ్డి(శాసనసభ నియోజకవర్గం): ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశ పెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, చాలామంది వక్తలు డా.అబ్దుల్ కలాంగారి గురించి ప్రస్తావించడం జరిగింది. అదృష్టం ఏమిటంటే, ఈ సభలో ఉన్నటువంటి చాలామంది సభ్యులు వారితో కలవడం జరిగింది. కొంతమందికైతేవారితో కలిసి పనిచేసే అదృష్టం కూడా దక్కింది. వారికి భారత రత్న అవార్డునివ్వడం ఒక అలంకారమైనప్పటికీ, వారి నిరాడంబరత్వమే అంతకంటే గొప్ప అలంకారంగా మనం చూడవచ్చు. వారికి లభించిన గౌరవం బహుశా ప్రపంచంలో ఏ దేశ రాష్ట్రపతికి కూడా లభించిన సందర్భం లేదు. కాబట్టి మనందరం వారిని స్ఫూర్తిగా తీసుకుని వారు ఎదిగినటువంటి జీవిత పేజీల్లో ఏ ఒక్క పేజీనైనా మనం చదువుకుని ఆచరించగలిగితే మనం కూడా ఈ సంఘానికి ఎంతో సేవ చేసిన వారం అవుతామని తెలియజేసుకుంటున్నాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ, వారి కుటుంబ సభ్యులందరికీ ప్రగాఢ సానుభూతిని తెలియజేసుకుంటూ ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశ పెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని మరొక్కసారి బలపరుస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ పాతూరి సుధాకర్ రెడ్డి(ఉపాధ్యాయ నియోజకవర్గం – మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ మరియు కరీంనగర్) : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశ పెట్టినటువంటి సంతాప తీర్మానాన్ని టిఆర్ఎస్ పార్టీ తరఫున సంపూర్ణంగా బలపరుస్తున్నాను. డా.అబ్దుల్ కలాం గారు మన దేశ ఔన్నత్యాన్ని ఇనుమడింప జేసినటువంటి మానవతావాది. ప్రత్యేకంగా ఒక ఉపాధ్యాయ ప్రతినిధిగా నేను గర్వపడుతున్నాను. ఎందుకంటే, ఆయన తన రాష్ట్రపతి పదవీ విరమణ తరువాత నీకు అత్యంత ప్రీతిపాత్రమైన వృత్తి ఏదని అడిగితే ఏదో వృత్తిపరమైన ఉద్యోగ విషయాన్ని ప్రస్తావన చేయకుండా ఉపాధ్యాయ వృత్తి అనే మాట చెప్పడం జరిగింది. అందుకు నేను గర్వపడుతున్నాను.

కడు బీదరికంలో ఉన్నటువంటి వ్యక్తి ఏన్నో పరిశోధనాత్మకమైనటువంటి అంశాల్లో, దేశం గర్వించే విధంగా, మిస్సైల్ మ్యాన్ అంటే డా.అబ్దుల్ కలాంగారు అనేటువంటి రీతిగా పేరు ప్రఖ్యాతులు గడించినటువంటి మహామనిషి డా.అబ్దుల్ కలాంగారు. బీదరికం అనేటువంటిది పరిశోధనలకు అడ్డు కాదని నిరూపించినటువంటి మహోన్నత వ్యక్తి ఆయన. ఈ రోజుల్లో ఏ విశ్వవిద్యాలయాల్లో చూసినప్పటికీ కూడా పరిశోధనాత్మకమైన కార్యకలాపాలు జరుగుతలేవు. కాబట్టి వారు పదే, పదే చెబుతూ విద్యార్థులంతా కలలు కనండి, ఆ కలలు సాకారమయ్యేట్లుగా కార్యక్రమాలు చేయాలని చెప్పారు.

పెద్దలు, గౌరవ సభ్యులు మరియు ప్రధాన ప్రతిపక్షనాయకులైన శ్రీ మహమ్మద్ అలీ షబ్బీర్ గారు డా.అబ్దుల్ కలాంగారిని ఆదర్శంగా తీసుకోవాలని చెబుతూ వచ్చారు. అందుకని వారి ఆదర్శాలన్నింటికి అనుగుణంగా ఉండేటువంటి రీతిగా ప్రజల సమస్యలన్నీ కూడా ప్రస్తావించి నిర్మాణాత్మకమైన సూచనలిచ్చి సభను సజావుగా నడిపేట్లుగా, హుందాతనంగా నిర్వహించేట్లుగా చేస్తారని ఆశిస్తూ, అందరం కూడా వారు బీదరికం నుండి రాష్ట్రపతి స్థాయి వరకు ఎలా ఎదిగారో ఆ విధానాల్ని ఆదర్శంగా తీసుకొని సరియైనటువంటి కార్యకలాపాలని నిర్వహించి, Simplicity, High thinking అనే ఆయన సూక్తిని మనందరం కూడా పాటించి, మన దేశానికి గర్వకారణంగా ఉండే విధంగా సభను నిర్వహించాలని ఆశిస్తూ, డా.అబ్దుల్ కలాంగారికి సంతాపాన్ని ప్రకటిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తూ సెలవుతీసుకుంటున్నాను.

శ్రీ యం.ఎస్. ప్రభాకర్ రావు(ఉపాధ్యాయ నియోజకవర్గం – హైదరాబాద్)ః రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశ పెట్టినటువంటి డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారి సంతాప తీర్మానానికి భారత కాంగ్రెస్ పార్టీ తరఫున మద్దతు తెలుపుతూ, పెద్దలు డా.ఏ.పి.జె. అబ్దుల్ కలాంగారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. మన రాష్ట్రానికి, దేశానికే కాకుండా ప్రపంచానికి కూడా వారు లేని లోటు కనబడుతోంది. గౌరవ సభ్యులు కొందరు వారితో గడిపిన అనుభవాలను తెలియజేయడం జరిగింది. కానీ, నాకెప్పుడూ వారితో కలిసి మాట్లాడే అవకాశం దొరకలేదు. అలాంటి మహానాయకులతో గడిపే అవకాశం దొరికిన వారంతా అదృష్ట వంతులుగా చెప్పుకోవచ్చు. డా.అబ్దుల్ కలాంగారు ఒక బీద కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా రాష్ట్రపతిగా ఎదగడమనే దానికి వారియొక్క స్వయంకృషేకారణమని చెప్పుకోవచ్చు. అనేకసందర్భాల్లో వారు ఎన్నో అవమానాల్ని కూడా భరించాల్సి వచ్చింది. కానీ, ఆయనలో పట్టుదల, క్రమశిక్షణ, నైతిక విలువలు వంటి సుగుణాలన్నీ కూడా ఆయనను ఎంతో ముందుకు తీసుకుపోయాయని అనడంలో ఎలాంటి సందేహం లేదు. వారు అనేక సందర్భాల్లో చట్ట సభలు ఏవిధంగా నడపాలి, ప్రతిపక్షాలను ఏవిధంగా గౌరవించాలని తెలియజేయడం జరిగింది.

కాబట్టి, వారు చెప్పిన సూచనల మేరకు వారి ఆత్మకు శాంతి కలగాలంటే ప్రతిపక్షాలను కూడా సరైన విధంగా గౌరవించి, వారికి సరైన విధంగా సమయం కేటాయించి ప్రజల సమస్యలు తెలియజేయడానికి అవకాశం ఇస్తారని తెలుపుతూ డా.అబ్దుల్ కలాం గారికి సంతాపం తెలుపుతూ, వారి ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి ఆలోచనలను మంచి స్ఫూర్తితో ముందుకు తీసుకువెళ్లే కార్యక్రమంలో మనందరం కూడా భాగస్వాములం కావాలని కోరుకుంటూ సెలవు తీసుకుంటున్నాను.

**11.00 ఉ.** డా. పల్లా రాజేశ్వర రెడ్డి (పట్టభద్రుల నియోజకవర్గం – వరంగల్, ఖమ్మం మరియు నల్గొండ) : అధ్యక్షా, భారత మాజీ రాష్ట్రపతి, భారత రత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మతికి నివాళులర్పిస్తూ ప్రవేశపెట్టిన సంతాప తీర్మానానికి నా మద్దతు తెలియచేస్తున్నాను. ఈ రోజున సభలో అనేకమంది గౌరవ సభ్యులు డాక్టర్ కలాంగారిని కలిసిన సందర్భాలు, వారి వలన స్ఫూర్తిని పొందిన అనేక సందర్భాలను తెలియచేయడం జరిగింది. నేను కూడా DRDOలో ఒక రీసెర్చ్ స్కాలర్‌గా, కంప్యుటేషన్ పని చేస్తున్నప్పుడు గౌరవ అబ్దుల్ కలాంగారిని కలుసుకునే అదృష్టం నాకు కలిగింది. నేను కూడా వారినుండి స్ఫూర్తిని పొందినవాడినే అని గర్వంగా చెప్పుకుంటున్నాను. వారు గడిపిన జీవితాన్ని మూడు భాగాలుగా మనం వర్గీకరించవచ్చు.

డా. అబ్దుల్ కలాంగారు 1960లో DRDOలో సైంటిస్ట్‌గా చేరిన తరువాత, అక్కడవారు ప్రాజెక్ట్‌డైరెక్టర్‌గా, సెంటర్ డైరెక్టర్‌గా, అడ్వైజర్‌గా, ఆ తరువాత భారత ప్రధానమంత్రికి Chief Scientific Adviserగా, అనేక పదవులు నిర్వర్తించారు. అంటే వారు కేవలం మిస్సైల్ మనిషిగానే కాకుండా, మరోవైపు ISROకి కూడా నాయకత్వం వహించడం జరిగింది. తరువాత వారు న్యూక్లియర్ సైంటిస్ట్‌గా కీలకమైన పాత్రను పోషించడం జరిగింది. భారతదేశంలో ఉన్న సైంటిస్ట్‌లందరికి వారు అత్యున్నతమైన గౌరవాన్ని ఆపాదించి పెట్టారు. ఆ తరువాత వారు భారతదేశ రాష్ట్రపతిగా ఉన్న సమయంలోనూ రాష్ట్రపతి భవన్‌కే పరిమితం కాకుండా, ప్రజల్లోకి వెళ్లి, ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారు “People’s President” గా కూడా పేరు పొందిన విషయం మనకు తెలుసు. రాష్ట్రపతిగా వారి పదవీ కాలం ముగిసిన తరువాత, దేశంలో ఉన్న అనేక విద్యాసంస్థలకు వెళ్లి, లెక్చర్స్ ఇస్తూ వచ్చారు. వారు అనేక యూనివర్శిటీలకు Honorary Professorగా సేవలందించారు. మొత్తం వారి ఎనభైమూడు సంవత్సరాల జీవితకాలంలో సైంటిస్ట్‌గా, భారత రాష్ట్రపతిగా, ప్రొఫెసర్‌గా అద్భుతంగా తన జీవితాన్ని దేశ ప్రజలకు అంకితం చేసిన మహానుభావుడు.

ఇంతకుముందు గౌరవ సభ్యులు శ్రీ రామచంద్రరావుగారు చెప్పినట్లు, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ సోమరాజుతో కలిసి కలాంగారు స్టెంట్‌ను రూపొందించారు. ప్రజల ఆరోగ్యం కొరకు ఒక టాబ్లెట్‌ను కూడా తయారుచేసిన గొప్ప మేధావి డా. కలాంగారు. చివరిగా, వారు చేసిన సేవలను గుర్తిస్తూ, వారు మనకు అందించిన స్ఫూర్తిని గౌరవిస్తూ, DRDO క్రింద ఎన్ని విభాగాలైతే ఉన్నాయో, వాటన్నింటికీ డా. అబ్దుల్ కలాంగారి పేరు పెట్టాలని ఈ ప్రభుత్వం ఇప్పటికే కేంద్రానికి లేఖ రాయడం జరిగింది. ఖచ్చితంగా కేంద్రం ఇందుకు అంగీకరిస్తుందని నేను ఆశాభావం వ్యక్తం చేస్తున్నాను. వారు రచించిన పుస్తకాలలో Wings of Fireను ఇప్పటికే JNTUవారు తమ సిలబస్‌లో చేర్చడం జరిగింది. అనేక అటానమస్ కాలేజీలలో కూడా ఆ Wings of Fireను సిలబస్‌లో పెట్టి, విద్యార్థులకు స్ఫూర్తిని అందించడం జరిగింది.

చివరగా రీసెర్చ్ స్కాలర్‌గా డా.అబ్దుల్ కలాంగారితో నేను పొందిన స్ఫూర్తిని మరిచిపోకుండా, మా ఇంజినీరింగ్ కాలేజీకి కూడా DRDO ల్యాబ్‌కు పెట్టిన ANURAG అనే పేరును పెట్టుకోవడం

జరిగింది. అనునిత్యం కూడా నేను వారి ద్వారా స్ఫూర్తిని పొందుతున్నాను. కాబట్టి ఈ తెలంగాణ రాష్ట్రం, ఇక్కడున్న ప్రజలు ఆయనను ఎప్పటికప్పుడు స్మరించుకుంటూ, వారు రచించిన పుస్తకాలను విద్యార్థులందరికీ అందించాలని కోరుతున్నాను. వారి గొప్పతనాన్ని తెలుపుతూ ప్రవేశపెట్టిన ఈ తీర్మానానికి నా సంపూర్ణ మద్దతు తెలియచేస్తున్నాను.

శ్రీ ఉల్లోళ్ల గంగాధర్ గౌడ్(శాసనసభ నియోజకవర్గం) : అధ్యక్షా, భారత మాజీ రాష్ట్రపతి భారత రత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపే తీర్మానాన్ని ప్రవేశపెట్టినటువంటి గౌరవనీయ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ముఖ్యంగా వారు చాలా సాధారణ వ్యక్తిగా ఉంటూ, రాష్ట్రపతిగా, సైంటిస్ట్‌గా ఈ దేశానికి ఎంతో సేవ చేశారు. అదే విధంగా సుధాకర్ రెడ్డి గారు చెప్పినట్లుగా, ఉపాధ్యాయుడిగా దేశానికి ఎంతో సేవ చేసిన వ్యక్తి. ముఖ్యంగా వారు చనిపోయిన తరువాత భారతదేశమంతా కూడా విద్యార్థులు, ప్రజానీకం సంతాప దినాల సమయంలో ఎన్నో ర్యాలీలు, సభలు పెట్టి వారికి ఒక ప్రగాఢమైన, నిజమైన నివాళులు అర్పించారు.

ముఖ్యంగా, ఈ దేశంలో మాజీ ప్రధాన మంత్రి జవహర్‌లాల్ నెహ్రూగారు ఏ విధంగా అయితే విద్యార్థులలో, చిన్నారులలో ఉత్తేజం కల్పించారో ఆవిధంగానే అబ్దుల్ కలాంగారు కూడా విద్యార్థులలో ముఖ్యంగా ప్రజలలో కూడా ఉత్తేజం కల్పించినటువంటి వ్యక్తి ఈ రోజు మనముందు లేకపోవడమనేది చాలా బాధాకరమైన విషయం. ముఖ్యంగా, నేను వ్యక్తిగతంగా వారితో మధురానుభూతి పొందిన సందర్భం అది. 2003వ సంవత్సరంలో నాబార్డ్ వారు అవార్డుల ప్రధానోత్సవాన్ని ఏర్పాటు చేసినటువంటి సందర్భంలో ఎప్పుడు కూడా గౌరవ రాష్ట్రపతులందరూ కూడా రాష్ట్రపతి భవన్‌లోనే అవార్డులను అవార్డ్ చేసే పరిస్థితి ఉండేది. దానికి వారు హైదరాబాద్ కూడా వచ్చి నాబార్డు వారు ఇచ్చినటువంటి అవార్డులలో మా నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ బెస్ట్ బ్యాంక్ ఇన్ ఆంధ్రప్రదేశ్‌గా వారి చేతుల మీదగా నేను అవార్డు పొందినటువంటి అనుభూతి వారి ద్వారా కలిగిన సందర్భంలో వారికి ఘనమైన నివాళులర్పిస్తున్నాను. వారు మాట్లాడిన సందర్భంలో కూడా నాబార్డు ఇచ్చినటువంటి అవార్డులలో బ్యాంకింగ్ రంగం కూడా ఈరోజు అటు రైతాంగానికే కాకుండా పేద ప్రజానీకానికి కూడా పూర్తి స్థాయిలో జాతీయం చేసినటువంటి బ్యాంకులే కాకుండా సహకార బ్యాంకులు, సహకార సంఘాలు కూడా క్రిందిస్థాయిలో గ్రామీణ స్థాయి నుండి కూడా పూర్తి స్థాయిలో సేవ చేస్తేనే భారతదేశంలో ఉన్నటువంటి ప్రజానీకమంతా ముందుకు రావడానికి అవకాశముంటుంది.

రైతాంగం కూడా ముందుకు రావడానికి అవకాశం ఉంటుందని ఆ రోజు వారు చేసినటువంటి ప్రసంగంలో కూడా చెప్పినటువంటిది. వారు ఎంత అనుభవజ్ఞులో, సైన్స్‌లో శాస్త్రజ్ఞుడిగా, ప్రజలకు అందుబాటులో ఉండే వ్యక్తిగా వారు చేసినటువంటి ప్రసంగాలలో కూడా ఎంతో అనుభూతిని పొందిన సందర్భంలో వారు భారత రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా వారు ఊరకనే కూర్చొనకుండా భారతదేశంలో ఉన్న ప్రతి రాష్ట్రాన్ని సందర్శిస్తూ, అటు విద్యార్థులలో, ప్రజలలో చైతన్యం కల్పించారు. భారత రాష్ట్రపతిగా ఉన్నటువంటి సందర్భంలో కాకుండా, శాస్త్రజ్ఞుడుగా, రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా సేవలు అందించినటువంటి మహోన్నత వ్యక్తి. వారి మృతికి ఉప ముఖ్యమంత్రిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబానికి, వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ, ఈ అవకాశం ఇచ్చిన ఛైర్మన్ గారికి కృతజ్ఞతలు తెలుయజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ బోడకుంటి వెంకటేశ్వర్లు(శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, గౌరవ ఉప-ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరి గారు భారత మాజీ రాష్ట్రపతి భారతరత్న డా. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారి మృతి పట్ల ప్రతిపాదించిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఇంతకు ముందే ఆయన గురించి చాలామంది పెద్దలు చాలా విషయాలు తెలియజేశారు. వారితో నాకున్న అనుబంధం తెలియజేస్తాను. నేను 13వ లోక్‌సభ సభ్యునిగా ఉన్నప్పుడు వారు భారత రాష్ట్రపతిగా నామినేషన్ వేసినప్పుడు వారిని నేను ప్రతిపాదించే అవకాశం నాకు దక్కిందని నేను ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాంటి గొప్ప వ్యక్తిని ప్రతిపాదించే అవకాశం నాకు దక్కడం నేను గర్వంగా భావిస్తున్నాను. ప్రధానంగా, వారి పుట్టిన ప్రదేశమైన రామేశ్వరానికి మా పార్లమెంట్ డెలిగేషన్ వెళ్లినప్పుడు వారి ఇంటిని కూడా మేము సందర్శించడం జరిగింది. అది చాలా చిన్న ఇల్లు. చిన్నప్పుడు ఒక పేపర్ బాయ్‌గా పనిచేసిన వ్యక్తి ఈరోజు భారతదేశానికి రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు. ఈరోజు వారి యొక్క శక్తి సామర్థ్యాలు చూసినట్లయితే, వారి పరిశోధనలలో ఒక పరిశోధకుడిగా ఎన్నో అవాంతరాలను ఎదుర్కొన్నప్పటికి కూడా, మనోధైర్యంతోనే వారు ముందుకు వెళుతూ, జలాంతర్గామిలో కూడా ప్రయాణం చేసినటువంటి వ్యక్తి డా. అబ్దుల్ కలాంగారు.

మేము మా లోక్‌సభ పరిధిలో ముందుగా అపాయింట్‌మెంట్ తీసుకొని ఎంతోమంది స్కూలు పిల్లలను తీసుకెళ్లి వారితో ఇంటరాక్ట్ కావడం జరిగేది. పిల్లలతో వచ్చి కలుస్తామని చెప్పగానే వారు తప్పనిసరిగా అపాయింట్‌మెంట్ ఇచ్చేవారు. ఆ రకంగా మా

నియోజకవర్గానికి చెందిన పిల్లలను ఎంతోమందిని రాష్ట్రపతి భవన్‌కు తీసుకెళ్లి పిల్లలతో ఇంటరాక్షన్ చేయించడం జరిగింది. అంతేకాకుండా, వారు పదవిలో ఉన్నా, లేకపోయినా అనునిత్యం మన హైదరాబాద్‌తో వారికి మంచి సంబంధం ఉండేది. వారు ఉద్యోగం చేసేటప్పుడు కూడా 10 సంవత్సరాలకు పైగా హైదరాబాద్‌లో ఉన్న డి.ఆర్.డి.ఓ.లో పనిచేశారు. రాష్ట్రపతిగా పదవీ విరమణ చేసిన తరువాత కూడా చాలా సందర్భాలలో ఎన్నో ముఖ్యమైన ప్రసంగాలను చేశారు. ఎంతోమందిని ఉత్తేజపరచేవారు. ఎన్నో దేశ, విదేశాలను చూశారు. వారు మృతి చెందిన తరువాత ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది సంతాపాన్ని తెలియజేశారు. వారి జన్మదినం రోజును World Students day గా పెట్టుకోవడం జరిగిందని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను. అలాంటి గొప్ప వ్యక్తికి మన శాసన మండలి తరఫున సంతాపాన్ని తెలియజేయడానికి మన ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు ప్రతిపాదించిన తీర్మానాన్ని బలపరుస్తూ, వారి కుటుంబానికి, వారి బంధువులకు హృదయపూర్వకంగా సానుభూతిని తెలియపరుస్తున్నాను.

శ్రీ ఎం.రంగారెడ్డి (శాసనసభ నియోజకవర్గం): అధ్యక్షా, ఉప ముఖ్యమంత్రి గారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని మా పార్టీ తరఫున బలపరుస్తున్నాము. ప్రపంచంలో మనం ఎంతోమంది మేధావులను చూశాం. విన్నాం. కాని, ఈ వ్యక్తి గురించి కాని, ఆయనకున్న మేధస్సును చూసిన తరువాతనే ఇంటలెక్చ్యువల్ అనే పేరు వచ్చిందనేది మనకు అర్థమవుతోంది. ఎన్నో లక్షలు, కోట్లు సంపాదించాలని ఆలోచన చేసిన వారికి ఇది ఒక కరెక్ట్ ఎగ్జాంపుల్. ఇంతకుముందు సభ్యులు మాట్లాడుతూ, వారికి రెండు ప్యాంట్లు, రెండు షర్టులు మాత్రమే ఉన్నాయని అన్నారు. అయినప్పటికీ ఇంత పేరు, ప్రతిష్టలు ఏ మానవునికి రాని విధంగా వారికి రావడానికి నిజంగా మన యుగంలో వారు పుట్టడం మన అదృష్టంగా భావించాలి. వారికి చిన్నప్పటి నుండి చదువు, విద్య, జ్ఞానం, మేధస్సు ఏదైతే ఉందో వాటిని తోటి మానవులకు కూడా నేర్పాలనే తపన వారిలో ఏదైతే చూశామో దానిని చూసి ప్రతి ఒక్కరం దానిని నేర్చుకొని మన సభలలో కాని, మన నిత్య జీవితంలో కాని మనం ఆచరణలో పెట్టగలిగితే మానవులందరం కూడా ఆ విధంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

నేను యూనివర్శిటీలో చదివేటప్పుడు అశ్వినీ కుమార్ అనే ఒక విద్యార్థి ఉండేవారు. అతను సబ్జెక్ట్‌లో వీక్‌గా ఉన్న విద్యార్థులకు, వారితో పరిచయం లేకున్నా కూడా రోజుకు నాలుగైదు గంటలు వారి దగ్గరకు వెళ్లి చదువుచెప్పేవారు. అప్పుడు మేమంతా అతనిని చూడగానే అతను ఏది చెబితే అది కరెక్ట్ అని నమ్మే విధంగా ఉండేది. కానీ, మొత్తం సమాజాన్నే influence చేయగలిగే వ్యక్తి ఈ తరుణంలో ఈ భారతదేశంలో ఎవరైనా ఉన్నారంటే అది డాక్టర్ కలాంగారు ఒక్కరే ఉన్నారని చెప్పవచ్చు. వారిది ఏ మతం, ఏ కులం, ఏ ప్రాంతం అనేది చూడకుండా ఈ దేశంలో ఇంత గౌరవంగా అందరం ఆదర్శంగా తీసుకున్నాం కాబట్టి, ఈ ప్రతిపాదనను ఏకగ్రీవంగా అందరం బలపరుస్తున్నాం కాబట్టి, డా. అబ్దుల్ కలాంగారు ఈ తెలంగాణ గడ్డ మీద ఎక్కువ కాలం పనిచేశారు కాబట్టి, నిజంగా ఈ గడ్డ గొప్పతనమో లేకవారు ఈ ప్రాంతంలో చేసినటువంటి సైంటిఫిక్ హిస్టరీ గొప్పతనమో కాని ఈ ప్రాంతంలో ఉన్నటువంటి గొప్ప ఇన్‌స్టిట్యూట్‌కు వారి పేరు పెట్టి గౌరవించడం మంచిది. సభ్యులందరూ చెప్పిన దానిని ఏకగ్రీవంగా మా పార్టీ కూడా బలపరుస్తుందని తెలియజేస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

جناب سید الطاف حیدر رضوی (Janab Syed Altaf Hyder Razvi): شکریہ چیرمین صاحب۔ اے پی جے عبد الکلام صاحب جو آج دنیا میں نہیں رہے، ان کی تعزیت کے لئے آج یہ قرارداد پیش کی جا رہی ہے۔ اس میں، میں اپنی پارٹی ایم آئی ایم کی جانب سے یہ کہنا چاہوں گا کہ عبدالکلام صاحب نہ صرف ہندوستان کے لئے بلکہ دنیا بھر کے لئے ایک بہت ہی بڑے Scientist تھے اور جنہوں نے اپنی خدمات کے ذریعہ نہ صرف اپنے ملک کی خدمت کی بلکہ بحیثیت صدر جمہوریہ انہوں نے ہندوستان کے لئے بھی ایک مثالی طور پر اس عہدہ پر رہتے ہوئے جس کے لئے ان کو یاد کیا جائے گا انہوں نے ایک بہترین کام کیا ہے۔ اس سے ہٹ کر جہاں تک ان کی قابلیت کی اور ان کے research کی بات کی جاتی ہے تو آج ان کے بارے میں یہ دیکھا جا رہا ہے کہ جہاں پر research کی بات آتی ہے تو ہندوستان کے لوگ نہ صرف ہندوستان میں بلکہ ساری دنیا میں نام کما رہے ہیں اور اس میں سب سے بڑا کوئی کام ہندوستان کی تاریخ میں research کی missile technology میں اگر لکھا جائے گا تو وہ اے پی جے عبد الکلام صاحب کا نام لکھا جائے گا۔ میں یہ بات اس لئے کہہ رہا ہوں کہ آج دنیا ترقی کرتی جا رہی ہے اور پھر نہ صرف ترقی بلکہ ایک ایسے دور میں جہاں پر technology کی آج سب سے بڑی ضرورت ہے تو اس کو ہمارے ملک کو آج defence system میں دنیا کے سب سے بہترین top کے جو ملک ہیں ان میں اگر لانے کا کام کیا ہے تو وہ اے پی جے عبد الکلام صاحب نے کیا ہے۔ میں ان کو خراج عقیدت بھی پیش کرتا ہوں اور ساتھ میں یہ کہنا چاہوں گا کہ انہوں نے جو research کا کام کیا ہے اس کام کو حکومت کو اور آگے بڑھانا چاہئے۔ ایسے کئی institutions جہاں پر مختلف چیزوں پر research کیا جاتا ہے ان research institutions کو support کرنا چاہئے اور ان کو بہترین institutions بنانا چاہئے کیونکہ آج ہمارے ملک سے جو young Scientists آ رہے ہیں، وہ کئی Scientists ایسے ہیں جو یہاں پر facilities نہ ہونے کی وجہ سے باہر دوسرے ملکوں میں جا کر کام کر رہے ہیں۔ آج نہ صرف defence field میں بلکہ ہر research کے کام کی بے حد ضرورت ہے تو آج ہم کو چاہئے کہ ان کو خراج عقیدت پیش کرنے کے لئے ہم ایسے institutions قائم کریں جو ہمارے ملک میں اس field کو اس research کے شعبہ کو ترقی دے، آگے بڑھائے نہ صرف مرکزی حکومت کے ذریعہ بلکہ ریاستی حکومت کے بھی ذریعہ اس کے اوپر کافی حد تک کام کیا جا سکتا ہے۔ چونکہ عبدالکلام صاحب نے حیدرآباد کے اندر رہتے ہوئے یہاں پر missile technology کے اوپر ایک بہت بڑا کام کیا ہے تو حیدرآباد بھی اس کا ایک حصہ ہے اور پھر یہاں پر بھی یہ چیزیں ہونی چاہئیں۔ میں اس مہان شخصیت کو اپنی پارٹی کی طرف سے اور اپنی طرف سے خراج عقیدت پیش کرتا ہوں اور ان کے افراد خاندان کو تعزیت پیش کرتا ہوں۔ آپ نے مجھے یہ موقع دیا اس کے لئے میں آپ کا شکریہ ادا کرتا ہوں۔ شکریہ۔

**11.20 ఉ.** శ్రీ యం.శ్రీనివాసరెడ్డి (నామినేటెడ్): అధ్యక్షా, మాజీ భారత రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతి పట్ల గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని సంపూర్ణంగా బలపరుస్తున్నాను. Simple living, High thinking అంటే ఏమిటో ఆచరించి చూపించిన గొప్ప వ్యక్తి ఆయన. ఒకమారుమూల గ్రామంలో సాధారణ కుటుంబంలో జన్మించి, భారతదేశంలో అత్యున్నత రాష్ట్రపతి పదవిని అలంకరించిన గొప్ప వ్యక్తి ఆయన. ఏ మీటింగు పెట్టినా, ఎక్కడికి పోయినా ఉపదేశాలు, నీతులు వల్లించినా, వాటిని ఆచరించని చాలామంది మనకి తెలుసు. నీతులు చెప్పడం కాదు, వాటిని ఆచరించడమేమిటో చూపించిన వ్యక్తి కలాం గారని తప్పక చెప్పవలసి ఉంటుంది. ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారు ఒక సైంటిస్టుగా, ఒక అడ్మినిస్ట్రేటర్‌గా, ఒక రాష్ట్రపతిగా... ఏ పదవి చేపట్టినా అందులో అభినందనలు అందుకున్న గొప్ప వ్యక్తి. ఇక్కడ ఇంకొక విషయమేమంటే, దేశంలో నెహ్రూగారి తర్వాత చిన్న పిల్లలు, విద్యార్థుల హృదయాలను చూరగొన్న వ్యక్తి కలాంగారే. విద్యార్థులు, చిన్న పిల్లలతో మీటింగులంటే కలాంగారు చాలా ఉత్సాహం చూపించేవారని తెలియజేస్తూ, ఈ కౌన్సిల్‌లో మొట్టమొదటి సారిగా మాట్లాడడానికి అవకాశం ఇచ్చిన అధ్యక్షుల వారికి ధన్యవాదాలు తెలియజేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

శ్రీ డి.రాజేశ్వరరావు(నామినేటెడ్): అధ్యక్షా, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారి మృతి పట్ల గౌరవ ఉప ముఖ్యమంత్రి శ్రీ కడియం శ్రీహరిగారు సభలో ప్రవేశపెట్టిన సంతాప తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఈరోజు ఆ మహనీయుని గురించి, మన సభలో ఆయన మృతిని జ్ఞాపకం చేసుకోవడం, ఆయన్ని స్మరించుకుంటూ చాలా మంది గౌరవ సభ్యులు మాట్లాడడం మంచి స్ఫూర్తినిచ్చింది. పేపర్లో చదవడం కన్నా సభలో ఒక్కొక్క సభ్యుడు ఆయన గొప్ప తనం గురించి మాట్లాడినపుడు చాలా స్ఫూర్తిగా అనిపించింది. అంత మంచి వ్యక్తి ఆయన. ఆయన గుణగణాల గురించి, ఆయనకి సంబంధించిన ఒక్కొక్క అంశం మీద సభ్యులు మాట్లాడారు. దాని గురించి నేను ఇక్కడ కూర్చొని ఆలోచించినపుడు చాలా సంతోషించాను. కానీ అదే రీతిగా బాధ కూడా పడ్డాను. ఒక సామాన్య బీద కుటుంబంలో పుట్టి, ఒక బీదవాడు ఏదైనా చేయగలుగుతాడు అన్నది ఆయన ప్రూవ్ చేయగలిగాడు. మన భారతదేశంలో, మన తెలంగాణ రాష్ట్రంలో ఎంతో మంది బీదవాళ్లున్నారు.

ఇప్పుడిప్పుడే వాళ్లు విద్యారంగంలో ముందుకెళుతున్నారు. అయినప్పటికీ మేము కూడా ఈదేశంలో రాణించగలం, ప్రూవ్ చేయగలం అనే స్ఫూర్తిని కలిగించి, ప్రతి విద్యార్థి హృదయంలో ఆదర్శంగా నిలిచిన వ్యక్తి ఎవరంటే అది మన మాజీ రాష్ట్రపతి ఎ.పి.జె. అబ్దుల్ కలాం గారని మనవి చేస్తున్నాను. ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం ఉంటుంది. ఉపాధ్యాయునిగానో, రాజకీయ నాయకునిగానో, లేక సైంటిస్టుగానో, సామాజిక సేవకునిగానో రాణించాలనే లక్ష్యం ఉంటుంది. కానీ కలాం గారికి అన్ని రంగాలలో నైపుణ్యత ఉంది. సైంటిస్టుగా, టీచర్‌గా, సామాజిక సేవకుడిగా, రాష్ట్రపతిగా ఎన్నో పాత్రలు పోషించిన వ్యక్తి ఆయన. అన్నింటిలో కూడా ఒక ప్రత్యేకత గల వ్యక్తి. ఒక రంగంలోనే పేరు తెచ్చుకున్న వ్యక్తి కాదు. ఎక్కడ ఏ స్థాయిలో పని చేసినా అక్కడ మంచి నేర్పరిగా, సమాజానికి తెలియజేసే విధంగా ఎదిగిన వ్యక్తి కలాంగారని మనవి చేస్తున్నాను. రక్షణ రంగంలో మన దేశానికి అవసరమైన మంచి మిస్సైల్స్‌ను తయారుచేశారు. ఆయన పేరును ఇక్కడ మనం మరొకసారి జ్ఞాపకం చేసుకుంటున్నాం. ఎందుకంటే ఆయన చనిపోయిన వార్త విన్నప్పుడు భారతదేశంలో ఉన్న ప్రతివాళ్ళూ టెలివిజన్‌లకు, దినపత్రికలకు అంకితమైపోయారు.

ఆయన భౌతికకాయాన్ని ఎప్పుడు ఢిల్లీకి తీసుకువస్తారు, ఎప్పుడు చూస్తామని ప్రతి పౌరుడు, అన్ని జాతులు, కులాలవాళ్ళు, చిన్న స్థాయి నుంచి పెద్దస్థాయి వరకు ఉన్న పౌరులు ఆయనని చూడాలని ఎంతో ఆతృతగా ఎదురుచూశారు. అటువంటి వ్యక్తి మన దేశంలో జన్మించడం భారతదేశానికే గర్వకారణమని మనవి చేస్తున్నాను. ఆయన వ్యక్తిత్వాన్ని దృష్టిలో పెట్టుకుని భారతదేశంలో ఎంతోమంది ఎదగాలని కోరుకుంటున్నాను. ఆయన స్ఫూర్తిగురించి ఈరోజు ప్రపంచదేశాలు హర్షం వ్యక్తం చేశాయి. మా సహచర సభ్యులు ప్రతిపాదించినట్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతిపాదించినట్లు ప్రపంచ దేశాలకు ఒక మెసేజ్ వెళ్ళే విధంగా కార్యక్రమాన్ని చేయాల్సిన అవసరముంది. ఎందుకంటే ఆయన సర్వీసెస్ ఇక్కడుండడమే గాకుండా, చిన్నపిల్లల నుండి పెద్దవాళ్ళవరకూ, మన శాసనపరిషత్తులోని సభ్యులు ఎంతోమందికి ఆయనను కలుసుకునే అవకాశం లభించింది కాబట్టి రాబోవు రోజుల్లో ప్రపంచంలోనే అత్యున్నత విద్యాసంస్థను తెలంగాణలో స్థాపించాలి, దానికి ఆయన పేరు పెట్టాలని, మనవాళ్ళు మంచి సలహాలను ఇచ్చారు. ఏది అనుకూలమైతే దానిని ముందుకు తీసుకురావాలని, అదేవిధంగా ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబానికినా ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేస్తూ, నాకు మాట్లాడడానికి అవకాశమిచ్చినందుకు ధన్యవాదాలు చెప్తూ, సంతాప తీర్మానానికిపూర్తి మద్దతు తెలియచేస్తూ సెలవు తీసుకుంటున్నాను.

جناب محمد سلیم (Janab Mohammed Saleem): کڈیم سری ہری صاحب نے اے پی جے عبد الکلام صاحب کے انتقال پر جو قرارداد پیش کی ہے، میں اس کی تائید کرتا ہوں اور دل کی گہرائیوں سے دکھ کا اظہار کرتا ہوں۔ دوسری بات یہ ہے کہ جب میں 2003ء میں اے پی اسٹیٹ وقف بورڈ کا چیرمین تھا، اس وقت مجھے وہاں سے بلاوا آیا تھا، جناب عبد الکلام نے خط لکھ کر ہم کو راشٹر پتی بھون بلایا تھا تو ہم وہاں گئے تھے۔ وہاں ہماری ان کے ساتھ وقف بورڈ کے بارے میں، مسجدوں کے بارے میں، درگاہوں کے بارے میں اور قبرستانوں کے بارے میں ایک گھنٹے تک بات ہوئی۔ بہت دیر تک بات کرنے کے بعد انہوں نے کہا کہ یہ چیزیں تو ٹھیک ہیں، آپ وقف بورڈ کے چیرمین ہیں، یہ ٹھیک ہے، مگر آپ کو نئی نسل کے لئے کوشش کرنی چاہئے، صرف minority community کے لئے نہیں بلکہ سب communities کے لئے کوشش کرنی چاہئے۔ ہندوستان کے ہر بچہ کو، ہر نوجوان کو، سب کو مل کر اچھے سے اچھی نئی technology سیکھنی چاہئے، اور ہر بچہ کو تعلیم دی جانی چاہئے چاہے وہ کتنا ہی غریب کیوں نہ ہو۔ ان کی سوچ ایسی تھی کہ ہر کوئی ترقی کرے۔ ان میں خود غرضی نہیں تھی بلکہ وہ ایک simple سے انسان تھے۔ میں نے ایسا انسان اپنی پوری زندگی میں نہیں دیکھا۔ ان میں اچھی اچھی باتیں پائی جاتی تھیں۔ میں 2003ء میں ایک گھنٹے تک ان کے چیمبر میں رہا۔ انہوں نے کہا کہ کوئی community نہیں، minorities, SCs, STs, BCs کچھ نہیں' یہ سب بھائی بھائی ہیں، ہندوستان کے جتنے ہندو، مسلمان، سکھ، عیسائی ہیں، سب کو مل کر ہندوستان کر ترقی دینا ہے اور پوری دنیا میں ہندوستان کے نام کو آگے بڑھانا ہے۔ ان کی طرح کا انسان پہلے نہیں آیا اور آئندہ پچاس سال میں بھی آنا مشکل ہے کیونکہ وہ ایک ہی واحد شخص تھے جو ہندوستان میں میزائیل بنانے میں نمبر ایک تھے۔ اس کے ساتھ ہی خدا حافظ، شکریہ۔

శ్రీ సబావత్ రాములు నాయక్(నామినేటెడ్) : అధ్యక్షా, డా. ఎ.పి.జె అబ్దుల్ కలాంగారి మృతిపట్ల ఈ సభలో ఉప-ముఖ్యమంత్రి కడియం శ్రీహరిగారు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నాను. ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారు పేపర్‌బాయ్ నుంచి శాస్త్రవేత్తగాను, రాష్ట్రపతిగాను, ఆయన చేసిన సేవలు దేశంలో మరపురానివి, మరవలేనివి. ఇంతకుముందు సభ్యులు చాలామంది మాట్లాడడం జరిగింది. కానీ నేను ఆయన మృతి గురించి సభలో మాట్లాడతానని అనుకోలేదు. ఇది మా దురదృష్టము. ఆయన అభినందన సభలో మాట్లాడాలనే కోరిక ఉండేది. కానీ అటువంటి అవకాశం భగవంతుడు కల్పించలేదు. ఇంకొక దురదృష్టం ఏమంటే నేను ఎపిజె అబ్దుల్‌కలాంగారిని కలవడానికి అనేకసార్లు ప్రయత్నం చేయడం జరిగింది. అంత మంచి వ్యక్తిని, అంత గొప్ప వ్యక్తిని కలవలేకపోయి నందుకు నా దురదృష్టంగా భావిస్తున్నాను. ఇంతకుముందు అనేకమంది సభ్యులు చెప్పడం జరిగింది.

మన ప్రతిపక్షనాయకులు షబ్బీర్‌గారు మాట్లాడుతూ, ఎ.పి.జె అబ్దుల్ కలాంగారిని కలిసినప్పుడు – కలాంగారు తన సంతకంతో తాను రాసిన పుస్తకాన్ని ఇవ్వడం జరిగిందని చెప్పారు. అటువంటి వ్యక్తిని దేశంలోనే కాదు ప్రపంచంలోనే గొప్ప వ్యక్తిగా గౌరవించడం జరిగింది. నేను, ఫారూఖ్‌గారు ఇద్దరమూ ముఖ్యమంత్రి జిల్లా అయిన మెదక్ జిల్లాకు సంబంధించిన వాళ్ళము. శ్రీ వెంకటేశం జిల్లా కలెక్టర్‌గా ఉన్నప్పుడు మెదక్‌జిల్లాలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఎపిజె అబ్దుల్‌కలాం గారితోఒక సమావేశాన్ని నిర్వహించడం జరిగింది. ఆ సభకు పోదామంటే నాకు పాస్ దొరకలేదు. సాధారణంగా రాష్ట్రపతిలాంటి వ్యక్తి చాలా పెద్దవాళ్ళతోనే సమావేశం పెట్టడం జరుగుతుంది కానీ, అతి పేద కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి ఆయనకు అన్నీ తెలుసు అందుకే ఆ ఉద్దేశ్యంతోనే మా మెదక్ జిల్లాలోని సామాన్యమైన విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమావేశం పెట్టడం నిజంగా సంతోషదాయకం. అలాగే ఇటువంటి సంతాప సభలో మాట్లాడుతున్నందుకు దురదృష్టంగా భావిస్తూ ఈ అవకాశమిచ్చిన గౌరవ అధ్యక్షులవారికి, సహచర సభ్యులందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తూ, ఉప-ముఖ్యమంత్రి కడియం శ్రీహరిగారు ప్రవేశపెట్టిన ఈ తీర్మానాన్ని బలపరుస్తూ, సెలవు తీసుకుంటున్నాను.

మిస్టర్ ఛైర్మన్ : సభలో అందరూ మాట్లాడినట్లుగా భారతదేశ మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంగారి మృతిపట్ల ఈ సభ తీవ్రమైనటువంటి సంతాపాన్ని వ్యక్తం చేస్తూ శోకార్తులైనవారి కుటుంబ సభ్యులకు తన సానుభూతిని తెలియజేస్తోంది. డాక్టర్ అబ్దుల్ కలాం గారు 1931వ సంవత్సరం, అక్టోబర్ 15వ తేదీన తమిళనాడులోని రామేశ్వరంలో జన్మించారు. తిరుచురాపల్లిలోని సెయింట్ జోసెఫ్ కళాశాలలో 1954లో భౌతిక శాస్త్రంలో పట్టభద్రులై, 1955వ సంవత్సరంలో మద్రాసులో ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో విద్యనభ్యసించినారు. 1970వ సంవత్సరం నుండి 1990వ సంవత్సరం వరకు ఇస్రోకు సేవలందించారు. ఆ కాలంలోనే స్వదేశీ పరిజ్ఞానంతో పి.ఎస్.ఎల్.వి-3ని వారు రూపొందించినారు. 1990వ సంవత్సరంలో డి.ఆర్.డి.ఓలో బాధ్యతలు స్వీకరించిన తరువాత స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అగ్ని, పృథ్వీ వంటి క్షిపణులకు రూపకల్పన చేశారు.

1992వ సంవత్సరం నుండి 1999వ సంవత్సరం వరకు రక్షణ మంత్రిత్వ శాఖకు సాంకేతిక సలహాదారుగా వారు పనిచేశారు. ఆ సమయంలోనే భారతదేశం నిర్వహించిన పోఖ్రాన్-ఐఐ అణుపరీక్షలలో డాక్టర్ కలాం ప్రధాన పాత్ర పోషించారు. 1999వ సంవత్సరం నుండి 2001వ సంవత్సరం వరకు భారత ప్రభుత్వానికి ముఖ్య శాస్త్ర సాంకేతిక సలహాదారుగా కూడా వారు పనిచేశారు. శ్రీహరికోటకు సతీష్‌ధావన్ అంతరిక్షకేంద్రం రావడంలో డాక్టర్ కలాం క్రియాశీల పాత్ర పోషించారు. 2002వ సంవత్సరం జూలై 25 నుంచి 2007వ సంవత్సరం జూలై 25 వరకు భారతదేశ పదకొండవ రాష్ట్రపతిగా వారు పనిచేశారు.

"India- 2020 – A Vision for the new Millennium, Wings of Fire, Ignited Minds, The Luminous Sparks, Inspiring Thoughts, You are born to blossom" అనే పుస్తకాలు వారు అనేకం రచించి ఉన్నారు. భారత ప్రభుత్వం డాక్టర్ కలాంగారి నిస్వార్థ సేవలకు గుర్తింపుగా 1981వ సంవత్సరంలో పద్మభూషణ్, 1990వ సంవత్సరంలో పద్మ విభూషణ్, 1997వ సంవత్సరంలో భారతరత్న బిరుదు, ఇందిరాగాంధి జాతీయ సమగ్రతా అవార్డును వారికి అందచేశారు. 1998వ సంవత్సరంలో **"వీర్ సావర్కర్"** అవార్డుతో ఈ ప్రభుత్వం వారిని సత్కరించింది. ప్రపంచ దేశాలలో దాదాపు నలభై ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల నుండి డాక్టర్ ఎ.పి.జె. అబ్దుల్ కలాంగారు గౌరవ డాక్టరేట్లను అందుకుని ఉన్నారు. దేశ యువతను ఎల్లప్పుడు కలిసి మాట్లాడుతూ వారిలో విజ్ఞాన తృష్ణను కలిగించడానికి ఎంతో ప్రేమించే ఆయన చివరి నిముషం వరకు అదే విధిలో నిమగ్నమై ఎనభై మూడేళ్ళ వయస్సులో 2015 జూలై 27వ తేదీన షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో 'Creating a liveable planet' అనే అంశంపై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ తీవ్రమైన గుండెపోటుతో అకాల మరణం చెందారు. డాక్టర్ అబ్దుల్ కలాంగారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ సభమొత్తంగా రెండు నిమిషాలు మౌనం పాటించవలసిందిగా కోరుతున్నాను.

(సభ రెండు నిముషాలు మౌనం పాటించింది)

మిస్టర్ ఛైర్మన్ : సెప్టెంబర్ 29, 2015వ తేదీ ఉదయం 10.00 గంటల వరకు సభను వాయిదా వేయడమైంది.

(The House, then adjourned at 11.36a.m. to meet again at 10.00a.m. on Tuesday, 29th September, 2015).

****

"Published under Rule 316 of the Rules of Procedure and Conduct of
Business in the Telangana Legislative Council and
printed at the Assembly Press, Public Garden's,
Hyderabad."